క్లుప్తంగా

ఎమ్మెల్యే పరామర్శ

రాజాం: పట్టణంలోని పుత్సల వీధికి చెందిన వైఎస్సార్ సీపీ నేత గుంటముక్కల సప్తగిరిని ఎమ్మెల్యే కంబాల జోగులు మంగళవారం కలిసి, పరామర్శించారు. ఇటీవల అనారోగ్యానికి గురైన సప్తగిరి ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందిన తర్వాత క్రమేక్రమంగా కోలుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఆయన ఇంటికి చేరుకుని, ఆరోగ్యంపై ఎమ్మెల్యే ఆరాతీశారు. ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాజాం టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లపట్టాల పంపిణీ



ఇళ్లపట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే శంబంగి, ఆర్డీవో సాయిశ్రీ

బొబ్బిలి: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో రంగరాయపురానికి చెందిన 24 మంది లబ్ధిదారులకు ఇళ్లపట్టాలు ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు, ఆర్డీవో సాయిశ్రీ చేతులమీదుగా మంగళవారం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతీ పేదవాడి సొంతింటి కల నెరవేర్చిన ఘనత ఒక్క సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. పేదలు అన్ని విధాలా బాగుండాలన్నదే ఆయన తపన అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ డోల రాజేశ్వరరావు, పార్టీ మండల అధ్యక్షుడు యు.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

24న తెలగ సంక్షేమ సంఘ వనభోజనాలు



మాట్లాడుతున్న ఏఎంసీ మాజీ చైర్మన్ శ్రీనివాసరావు

బొబ్బిలి: స్థానిక రాణిగారి తోటలో ఈ నెల 24వ తేదీన తెలగ సంక్షేమ సంఘ వనభోజన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏఎంసీ మాజీ చైర్మన్, న్యాయవాది పువ్వల శ్రీనివాసరావు తెలిపారు. ఇదే విషయమై ఆయన మంగళవారం సంఘ నాయకులు, సభ్యులతో కలిసి సమావేశమై, విలేకరులతో మాట్లాడారు. వనభోజనానికి సంఘ సభ్యులంతా కుటుంబ సభ్యులతో కలిసి హాజరై, సంఘ ఐక్యతను చాటుకోవాలని కోరారు.

ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే చర్యలు



రంగరాయపురంలో జగనన్న కాలనీ స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన రెవెన్యూ సిబ్బంది

బొబ్బిలి: ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వీఆర్వో సింహాచలం హెచ్చరించారు. తహసీల్దార్ డోల రాజేశ్వరరావు ఆదేశాల మేరకు మండలంలోని రంగరాయపురంలో ఉన్న జగనన్న కాలనీలో పలువురు ఆక్రమణదారులు ఆక్రమించుకున్న స్థలాలను వీఆర్వో మంగళవారం పరిశీలించి, స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఆ స్థలంలో ప్రభుత్వ స్థల ఆక్రమణదారులు శిక్షార్హులన్న బోర్డు ఏర్పాటు చేశారు.

కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాలు

తెర్లాం/రాజాం/మెంటాడ: మండలాల్లోని అన్ని గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల సేవలు కొనసాగుతున్నాయి. అంగన్‌వాడీ కార్యకర్తలు సమ్మె చేపడుతున్న నేపథ్యంలో కేంద్రాల్లో కార్యకలాపాలు ఆగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. సచివాలయ సిబ్బందితో ప్రతిరోజూ కేంద్రాలు తెరిచి, లబ్ధిదారులకు అందాల్సిన పౌష్టికాహారం అందేలా చూస్తున్నారు. చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యనందిస్తున్నారు. ఏం జరిగినా లబ్ధిదారులకు అన్యాయం జరగకూడదన్న సదుద్దేశ్యంతో జగనన్న సర్కారు తీసుకున్న ఈ నిర్ణయాన్ని అందరూ సమర్థిస్తుండడం విశేషం.

ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యం



రాజాం: ఆరోగ్యశ్రీ కొత్త కార్డులు అందజేస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు



బొబ్బిలి: ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి



రేగిడి: లబ్ధిదారులకు ఆరోగ్యశ్రీ కార్డులు అందిస్తున్న వైస్ ఎంపీపీ అచ్చెన్నాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు జగన్మోహనరావు



వంగర: ఆరోగ్యశ్రీ కార్డులు అందజేస్తున్న ఎంపీపీ సురేష్‌ముఖర్జీ, పార్టీ మండల కన్వీనర్ సుదర్శనరావు



బాడంగి: ఆరోగ్యశ్రీ కొత్తకార్డు ప్రయోజనాలు వివరించే బ్రోచర్‌తో జెడ్పీటీసీ రామారావు, తదితరులు



సంతకవిటి: ఎంపీడీవో కార్యాలయంలో ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ జగన్మోహనరావు

- ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీలో ఎమ్మెల్యే కంబాల జోగులు



రామభద్రపురం: మండల కేంద్రంలోని సచివాలయం-1లో ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ లక్ష్మణరావు

రాజాం: ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. మండలంలోని అంతకాపల్లి గ్రామంలో సచివాలయం వద్ద కొత్త ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ మంగళవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మక పరిపాలన కొనసాగిస్తున్నారని, విద్య, వైద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారన్నారు. నాడు-నేడు పథకం ద్వారా అటు విద్యను, ఇటు వైద్యాన్ని అభివృద్ధి చేశారన్నారు. ఇప్పుడు ఆరోగ్యశ్రీ ఆపరేషన్ల వ్యయ పరిమితిని రూ.10 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచి, పేదలకు కార్పొరేట్ వైద్యం దరిచేర్చారన్నారు. దేశంలోని ఏ రాష్ట్రంలో లేని విధంగా మన రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ పథకం అమలు జరుగుతోందన్నారు. ఆరోగ్యశ్రీ పథకం ఎంతోమందికి ప్రాణదానం చేసిందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బి.నర్సింహులు, సర్పంచ్ వి.చిన్నంనాయుడు, జేసీఎస్ కన్వీనర్ కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వంగర: స్థానిక సచివాలయంలో ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ చేతులమీదుగా ఆరోగ్యశ్రీ కొత్తకార్డులను లబ్ధిదారులకు మంగళవారం అందజేశారు. ఎంపీపీ మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పథకం పేదలకు గొప్ప వరమని, దేశ చరిత్రలో లేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పథకాలు అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ కె.సుదర్శనరావు తదితరులు పాల్గొన్నారు.

రేగిడి: స్థానిక పీహెచ్‌సీ ఆవరణలో ఆరోగ్యశ్రీ కొత్తకార్డుల పంపిణీ మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు చేతులమీదుగా పలువురు లబ్ధిదారులకు కార్డులు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వి.జగన్మోహనరావు, ఎంపీడీవో శ్యామలాకుమారి, తహసీల్దార్ సుదర్శనరావు, వైద్యాధికారులు అసిరినాయుడు, సోహిణీరాఘవ్ తదితరులు పాల్గొన్నారు.

సంతకవిటి: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు చేతులమీదుగా కొత్త ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ చికిత్స వ్యయ పరిమితిని రూ.10 లక్షల నుంచి రూ.25 లక్షలకు ప్రభుత్వం పెంచడం జరిగిందన్నారు. ఆరోగ్యశ్రీ పేదలకు వరంగా నిలుస్తోందని, పేదల బాగు కోసం నిరంతరం తపనపడే వ్యక్తుల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎప్పుడూ ముందుంటున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రవికుమార్, వైద్యాధికారి నాగేంద్రప్రసాద్, జేసీఎస్ కన్వీనర్ రమేష్‌నాయుడు పాల్గొన్నారు.

2024 జనవరి 1 నుంచి అమలు..

బొబ్బిలి: ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. మంగళవారం స్థానిక పట్టణంలోని రావు వారి వీధిలో జరిగిన ఆరోగ్యశ్రీ కొత్తకార్డుల పంపిణీకి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన చేతులమీదుగా పలువురు లబ్ధిదారులకు కార్డులు అందజేశారు. అనంతరం ఆయన ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మేలును వివరించారు. అన్ని రంగాల్లో అన్ని వర్గాల వారికి ప్రభుత్వం సమన్యాయం చేస్తోందన్నారు. ముఖ్యంగా పేదల జీవితాల్లో సంతోషం చూడాలన్న లక్ష్యంతోనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన కొనసాగిస్తున్నారన్నారు. నాడు-నేడు పథకం ద్వారా ఇప్పటికే ఆస్పత్రులను అభివృద్ధి చేసిన ఆయన ఇప్పుడు మరో అడుగు ముందుకు వేసి, ఆరోగ్యశ్రీ పథకం ద్వారా పేదలకు అందిస్తున్న వైద్యానికి అయ్యే ఖర్చు పరిమితిని రూ.10 లక్షల నుంచి రూ.25 లక్షలు చేసి వారికి ఎంతోమేలు చేశారన్నారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా పేదలకు మరింత లాభం చేకూరుస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయన్నారు. ఆరోగ్యశ్రీ ప్రయోజనాలు 2024 జనవరి 1వ తేదీ నుంచి వర్తిస్తాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, జేసీఎస్ పట్టణ ఇన్‌చార్జ్ ఆర్.ఈశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు సీహెచ్ రమేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రామభద్రపురం: మండల కేంద్రంలోని సచివాలయం-1లో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు చేతులమీదుగా ఆరోగ్యశ్రీ కొత్తకార్డులు మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. ప్రభుత్వ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బాడంగి: మండలంలోని బాడంగి-2 సచివాలయం పరిధిలో ఉన్న పిన్నవలస గ్రామంలో జెడ్పీటీసీ పెద్దింటి రామారావు చేతులమీదుగా ఆరోగ్యశ్రీ కొత్తకార్డుల పంపిణీ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మేలును వివరించారు. ప్రభుత్వ వైద్య సదుపాయాలు వినియోగించుకుని, ఎంతో మంది నిరుపేదలు పునర్జన్మ పొందారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జగన్నాథం పాల్గొన్నారు.

బొబ్బిలి: మండలంలోని కలువరాయి గ్రామంలో ఎంపీపీ శంబంగి లక్ష్మీవేణుగోపాలనాయుడు చేతులమీదుగా మంగళవారం ఆరోగ్యశ్రీ కొత్తకార్డుల పంపిణీ చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.నటరాజ్, పార్టీ మండల అధ్యక్షుడు యు.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

జగనే మళ్లీ సీఎం కావాలి

వై ఏపీ నీడ్స్ జగన్(ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే) కార్యక్రమం చాలా చురుగ్గా జరుగుతోంది. జై జగన్, జై వైఎస్సార్ సీపీ నినాదాలతో గ్రామాలు, పట్టణాలు, నగరాలు హోరెత్తుతున్నాయి. ప్రభుత్వం చేసిన మేలును వివరించడమే లక్ష్యంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో మంగళవారం పార్టీ శ్రేణులంతా ఇంటింటికీ వెళ్లి, నాలుగున్నరేళ్లుగా జగనన్న సర్కారు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం వివరించారు. సచివాలయాల వద్ద ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాల బోర్డులు, పార్టీ జెండాలు ఆవిష్కరించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రానికి, రాష్ట్రంలోని ప్రజలకు మేలు అని, గతంలోని టీడీపీ పాలనకు, ప్రస్తుత వైఎస్సార్ సీపీ పాలనకున్న స్పష్టమైన తేడాను గమనించాలన్నారు. మేలు జరిందంటేనే వచ్చే ఎన్నికల్లో ఓటేసి, గెలిపించాలని కోరగా, జగనన్నే మళ్లీ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుతుండడం పార్టీ శ్రేణుల్లో మరింత ఉత్సాహం నింపింది.

– సాక్షి నెట్‌వర్క్



సంతకవిటి: జి.ఎన్.పురం సచివాలయంలో ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాల బోర్డు వద్ద ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది



వంగర: శ్రీహరిపురంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ సురేష్‌ముఖర్జీ, పార్టీ మండల కన్వీనర్ సుదర్శనరావు తదితరులు



బాడంగి: గజరాయునివలసలో జరిగిన కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు



బొబ్బిలి: మండల కేంద్రంలోని 27వ వార్డులో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమ ప్రచారంలో మున్సిపల్ చైర్మన్ మురళీకృష్ణారావు తదితరులు



రేగిడి: తునివాడలో సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరించిన వైఎస్సార్ సీపీ నేతలు అచ్చెన్నాయుడు, జగన్మోహనరావు

వైఎస్సార్ సీపీతోనే
పేదలకు మరింత మేలు

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



ఇంటింటికీ వెళ్లి, సంక్షేమ పాలనను వివరిస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

రామభద్రపురం: వైఎస్సార్ సీపీతోనే పేద ప్రజలకు మరింత మేలు జరుగుతుందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. మండలంలోని కొట్టక్కి గ్రామంలో మంగళవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగున్నరేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలని అడగ్గా, పలువురు ఆయన దృష్టికి తెచ్చిన సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నాడు చంద్రబాబు హయంలో దోపిడీ పాలన జరిగిందని, నేడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగేలా పాలన జరుగుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి పనులు చేపట్టడం లేదని ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. అభివృద్ధి అంటే టీడీపీ లాగా దోచుకోవడం, దాచుకోవడం, ఆ పార్టీ కార్యకర్తలకు పంచిపెట్టడం కాదన్నారు. అభివృద్ధి అంటే పేద, బడుగు, బలహీన, మైనార్టీ వర్గాల జీవితాల్లో వెలుగులు నింపడమన్నారు. ఈ పని సీఎం జగనన్న మంచి మనసుతో చేస్తున్నారని, దానిని మనమంతా మెచ్చుకోవాలని హితవుపలికారు. రెండేళ్ల పాటు కరోనా కారణంగా ఆర్థిక ఇబ్బందులున్నా ఎక్కడా సంక్షేమ పథకాల అమలు ఆగలేదన్నారు. ఇదే సీఎం జగన్‌కు ఉన్న చిత్తశుద్ధి, నిబద్ధత అన్నారు. భవిష్యత్‌లో మరింత సంక్షేమం, అభివృద్ధి కావాలంటే వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఎన్నికల మేనిఫెస్టో లోని దాదాపు 99 శాతానికి పైగా హామీలు నెరవేర్చిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదేనన్నారు. ప్రజలంతా వైఎస్సార్ సీపీ పక్షాన ఉన్నారని, 2024 ఎన్నికల్లోనూ 175కి 175 సీట్లు గెలిపించి, ప్రజాసంక్షేమ పాలనకు పట్టంగడతారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సీహెచ్ లక్ష్మణరావు, జెడ్పీటీసీ ఎ.సరస్వతి, బొబ్బిలి మండల ఎంపీపీ ప్రతినిధి ఎస్.వేణుగోపాలనాయుడు, పార్టీ మండల కన్వీనర్ ఎ.లక్ష్మణ్‌నాయుడు, ఎంపీటీసీ రమణమ్మ, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ రాయులు, ఎంపీడీవో రమామణి తదిరులు పాల్గొన్నారు.

ఈవీఎంల వినియోగంపై అవగాహన



ఈవీఎం వినియోగం తీరును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఈవీఎం(ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్)ల వినియోగంపై మంగళవారం అవగాహన కల్పించారు. కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు రోజుకు ఎంతమంది కేంద్రాన్ని సందర్శించి, ఈవీఎంల వినియోగాన్ని తెలుసుకుంటున్నారని ఆరాతీశారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ త్వరితగతిన ఈవీఎంల ద్వారా ఓటు వేసే విధానంపై ప్రజలను చైతన్యం చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో ఎ.సాయిశ్రీ, తహసీల్దార్ రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

- మద్దతు ధరకే ప్రభుత్వం ధాన్యం కొనుగోలు
- వ్యవసాయ శాఖ ఏడీఏ కె.చంద్రరావు



రాజాం: బొద్దాంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తరలిస్తున్న ధాన్యాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ ఏడీఏ చంద్రరావు

రాజాం: దళారులను ఆశ్రయించి, మోసపోవద్దని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల వద్దనే ధాన్యం అమ్మకాలు చేయాలని వ్యవసాయ శాఖ ఏడీఏ కె.చంద్రరావు రైతులకు సూచించారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి, రైతులకు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్మకాలపై అవగాహన కల్పించారు. మద్దతు ధరకే ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేస్తోందని, చివరి గింజ వరకు ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేస్తుందన్నారు. తేమ శాతాన్ని పరిశీలించి, ఆర్బీకేల ద్వారా ట్రక్కు షీట్లు మంజూరు చేయించి, కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తరలించాలన్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం అమ్మితే సకాలంలో బిల్లుల చెల్లింపు చేయడం జరుగుతుందన్నారు. మండలంలో ఇప్పటివరకు 18 ఆర్బీకేల పరిధిలో 1,096 మంది రైతుల దగ్గర నుంచి 3,695 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు.

బాడంగి: మండలంలోని గొల్లాది, కామన్నవలస గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను బొబ్బిలి ఆర్డీవో ఎ.సాయిశ్రీ మంగళవారం సందర్శించి, తనిఖీలు నిర్వహించారు. తొలుత ఆర్బీకే సిబ్బంది హాజరు, పనితీరుపై ఆరాతీశారు. అనంతరం ధాన్యం ఎంతమేర కొనుగోలు చేశారని ప్రశ్నించగా 100 మెట్రిక్ టన్నుల వరకు కొనుగోలు చేసి, రైస్‌మిల్లులకు పంపించినట్లు సిబ్బంది తెలిపారు. అక్కడి నుంచి కళ్లాలకు చేరుకుని, అక్కడ పంటనూర్పిడి చేస్తున్న రైతులతో మాట్లాడి, ధాన్యం కొనుగోలు ప్రక్రియ ఎలా సాగుతోందని అడిగి తెలుసుకోగా, వారు సక్రమంగా జరుగుతోందని అన్నారు. అలాగే వారు గోనెసంచులు కావాలని కోరగా, తప్పకుండా అందేలా చూస్తామని ఆర్డీవో అన్నారు. ఆమె వెంట మండల ప్రత్యేకాధికారి సూర్యచంద్రరావు, వ్యవసాయాధికారి కె.శిరీష తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రుచి,శుచి కలిగిన భోజనం

రేగిడి: జగనన్న గోరుముద్ద పథకం కింద ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు రుచి, శుచి కలిగిన భోజనం అందివ్వాలని ఎంఈవో-2 బి.ఎరయ్య సూచించారు. మండలంలో కొత్తచెలికానివలస ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను మంగళవారం సందర్శించిన ఆయన మధ్యాహ్న భోజనం వంట నిర్వాహకులతో మాట్లాడి, వేడివేడిగా ఉన్నప్పుడే విద్యార్థులకు భోజనం వడ్డించాలని, మెనూ ప్రకారం వంటకాలు చేసి, పెట్టాలని తెలిపారు.

సకాలంలో రుణాల మంజూరు

తెర్లాం: బ్యాంకుల ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన వివిధ రుణాలను సకాలంలో మంజూరు చేసేలా వెలుగు అధికారులు, వీఏవోలు చర్యలు తీసుకోవాలని వెలుగు ఏరియా కో-ఆర్డినేటర్ ఎ.చిరంజీవి సూచించారు. మంగళవారం స్థానిక భారతీయ స్టేట్ బ్యాంక్‌లో వెలుగు, బ్యాంకు అధికారులు సమీక్ష సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలైన పీఎంఈజీపీ, పీఎంఎఫ్ఎం ఈ రుణాలకు సంబంధించి, లబ్ధిదారులకు రుణాలు మంజూరయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. స్థానిక స్టేట్‌బ్యాంక్ చీఫ్ మేనేజర్ మధుసూదనరావు మాట్లాడుతూ అర్హులైన డ్వాక్రా సంఘాల మహిళలకు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసే రుణాలు ఇచ్చేందుకు సిద్ధమన్నారు.

ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలి

- కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి



నైరేడ్‌లో శిక్షణార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

రాజాం: అందుబాటులో ఉన్న స్వయం ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి యువతకు సూచించారు. స్థానిక పట్టణంలోని జీఎంఆర్ ఫౌండేషన్ నైరేడ్ నిర్వహిస్తున్న ఉచిత స్వయం ఉపాధి, నైపుణ్య శిక్షణ కార్యక్రమాలను ఆమె మంగళవారం పరిశీలించారు. జీఎంఆర్ వీఎఫ్, నాబార్డు సాయంతో ఇస్తున్న ఈ శిక్షణకు సంబంధించి, పలు అంశాలను అభ్యర్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం శిక్షణార్థులతో కాసేపు మాట్లాడి, భోజనం, వసతి వంటి మౌలిక సదుపాయాలపై ఆరాతీశారు. కంప్యూటర్ ల్యాబ్, హోమ్ నర్సింగ్ ట్రెనింగ్ డిపార్ట్‌మెంట్‌లు చూసి, సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్ శిక్షణ పొందిన అభ్యర్థులకు టూల్ కిట్లు, ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. నాబార్డు డీడీఎం నాగార్జున మాట్లాడుతూ గతేడాది కాలంలో కొత్త శిక్షణా కోర్సులు ఇచ్చేందుకు నాబార్డు ద్వారా రూ.60 లక్షలు మంజూరు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎల్‌డీఎం శ్రీనివాసరావు, రీజనల్ మేనేజర్ నరేష్, జీఎంఆర్‌వీఎఫ్ జీఎం జయకుమార్, డైరెక్టర్ రాజేష్, ఏపీఎం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ట్రైనీ కలెక్టర్ పరిశీలన



రైస్‌మిల్లు సందర్శనలో ట్రైనీ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్

మెంటాడ: మండలంలోని చల్లపేట, మీసాలపేట, ఉద్దంగి, కొంపంగి గ్రామ సచివాలయాలతో పాటు రైస్‌మిల్లులను ట్రైనీ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్ మంగళవారం సందర్శించి, వాటి పనితీరు పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బంది పలు సూచనలు సలహాలు చేశారు. ప్రజల సమస్యలను సకాలంలో పరిష్కరించాలని సచివాలయ సిబ్బందికి, ధాన్యం కొనుగోలు ప్రక్రియ సక్రమంగా చేపట్టాలని ఆర్బీకే సిబ్బందికి సూచించారు. చల్లపేటలోని రైస్‌మిల్లు యజమానితో మాట్లాడిన ఆయన రైతులను ఇబ్బంది పెట్టకుండా చూడాలన్నారు. అలాగే ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ పథకాల లబ్ధిదారులతో మాట్లాడి, పథకాలు ఎలా అందుతున్నాయని అడిగారు. వారంతా సక్రమంగా అందుతున్నాయి.. పాలన బాగుందని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.